TGTEL/26/A5513

వార్తదీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 73 | 05 సోమవారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు: కవిత

హామీ ఏమైందని సూటి ప్రశ్న

- **కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రానికి వెళ్లడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సరిహద్దు చొరబాటుపై భగ్గుమన్న భారత్.. పాక్ దౌత్యవేత్తకు సమన్లు



- **సరిహద్దు చొరబాట్లపై పాకిస్థాన్ దౌత్యవేత్తకు భారత్ సమన్లు**
- **పంజాబ్ సరిహద్దుల్లో ఇద్దరు చొరబాటుదారులను కాల్చిచంపిన బీఎస్ఎఫ్**
- **పాక్ ఆరోపణలను ఖండించిన భారత్.. నార్కోటిక్స్ ముఠాల పనేనని ఆరోపణ**
- **చనిపోయింది అమాయక పౌరులంటూ భారత దౌత్యవేత్తకు పాక్ నిరసన**
- **ఘటనపై దర్యాప్తు జరపాలని పరస్పరం డిమాండ్ చేసుకుంటున్న ఇరు దేశాలు**

సరిహద్దుల గుండా అక్రమ చొరబాట్లను పాకిస్థాన్ ప్రోత్సహిస్తోందంటూ భారత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంపై గట్టి నిరసన తెలిపేందుకు, నిన్న ఢిల్లీలోని పా కిస్థాన్ హైకమిషన్ తాత్కాలిక దౌత్య అధికారికి సమన్లు జారీ చేసింది. ...మిగతా 2 లో...

ఫ్లైదుబాయ్ విమాన ఘటన.. క్యాబిన్ సిబ్బంది పాత్రపై అనుమానాలు!

- **ఫ్లైదుబాయ్ విమానంలో భారత పైలట్ కెప్టెన్‌పై దాడి చేసిన ఒమన్**
- **జాతీయుడైన కో-పైలట్ యత్నాన్ని భగ్నం చేసి, కో-పైలట్‌ను బంధించిన ప్రయాణికులు**
- **దాడి చేసిన వ్యక్తిని విడిచిపెట్టాలని సిబ్బంది కోరడంతో ప్రయాణికుల్లో తీవ్ర అనుమానాలు**
- **సిబ్బందిని నమ్మని ప్రయాణికులు.. పోలీసులకే అప్పగిస్తామని స్పష్టీకరణ**
- **ప్రయాణికుల సమయస్ఫూర్తితో విమానం సురక్షితంగా ల్యాండింగ్**


దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఊహించని, భయానక ఘటన చోటు చేసుకుంది. విమానాన్ని కూల్చివేసే ఉద్దేశంతో కో-పైలట్, భారతీయ పైలట్‌పై గొడ్డలితో దాడికి పాల్పడగా, ప్రయాణికులు సాహసోపేతంగా ఆ యత్నాన్ని అడ్డుకున్నారు. అయితే, ఈ ఘటనలో విమాన సిబ్బంది ప్రవర్తన తీవ్ర అనుమానాలకు, కొత్త వివాదానికి దారితీసింది.అసలేం జరిగిందంటే.. ఫ్లైదుబాయ్‌కు చెందిన ఎఫ్ జెడ్ 1073 విమానం టెల్ అవీవ్‌కు బయలుదేరిన కొద్దిసేపటికే కాక్‌పిట్‌లో కలకలం రేగింది. ఒమన్‌కు చెందిన కో-పైలట్ హమామ్ అల్-హమామి, విమానాన్ని నడుపుతున్న భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్‌పై క్రాష్ యాక్స్ (విమానంలో ఉండే చిన్న గొడ్డలి)తో దాడికి తెగబడ్డాడు.

...మిగతా 2 లో...



70,000 మందికి అవకాశం..!

- **ఈ ఏడాది 70 వేల మంది భారతీయులకు రష్యాలో ఉద్యోగాలు**
- **నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాలకు అధిక ప్రాధాన్యం**
- **రష్యాతో వాణిజ్యం పెంపునకు భారత్ ప్రయత్నాలు**
- **చెన్నై-వ్లాదివోస్టాక్ కారిడార్‌పై కీలక చర్చలు**
- **రష్యా సైన్యంలో చిక్కుకున్న 140 మంది భారతీయుల విడుదల**



భారత్, రష్యా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయి. ఈ ఏడాది సుమారు 70,000 మంది నైపుణ్యం కలిగిన భారతీయ కార్మికులకు తమ దేశంలో ఉపాధి కల్పించేందుకు రష్యా అంగీకరించింది. ముఖ్యంగా నిర్మాణ, లాజిస్టిక్స్ రంగాల్లో ఈ నియామకాలు జరగనున్నాయి. ఈ కీలక విషయాన్ని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్వయంగా వెల్లడించారు. పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశంలో ఆయన ఈ వివరాలు తెలిపారు.భారత్-రష్యా సంబంధాలపై జరిగిన ఈ సమావేశానికి జైశంకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణిజ్యం, పెట్టుబడులు, ఇంధనం, కనెక్టివిటీ, సాంస్కృతిక, ప్రజల మధ్య సంబంధాలు వంటి పలు అంశాల్లో ఇరు దేశాలు కలిసి పనిచేస్తున్నాయని వివరించారు. ...మిగతా 2 లో...

రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు: కవిత

- **కుప్పంకు నీళ్లిస్తూ పాలమూరు రైతులకు అన్యాయం చేస్తున్నారని ఆరోపణ**
- **రాష్ట్రంలో కరవు మండలాలను తక్షణమే ప్రకటించాలని ప్రభుత్వానికి డిమాండ్**
- **రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ హామీ ఏమైందని సూటి ప్రశ్న**
- **కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యం వల్లే రాష్ట్రంలో కరవు పరిస్థితులని విమర్శలు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు పంపిస్తున్నారంటూ తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సంచలన ఆరోపణలు చేశారు. కృష్ణా నది జలాలు పొరుగు రాష్ట్రంలోని కుప్పంకు వెళుతున్నాయని, కానీ మన మహబూబ్‌నగర్ రైతులకు మాత్రం చుక్క నీరు అందడం లేదని ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

...మిగతా 2 లో...



కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ గౌరవం..

కాలిఫోర్నియా హెల్త్ ఫెస్ట్‌కు ఆహ్వానం...



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ ఆహ్వానం అందింది. అమెరికాలోని కాలిఫోర్నియాలో నిర్వహించనున్న 2026కు విశిష్ట అతిథిగా ఆహ్వానం వచ్చింది. అక్టోబర్ 30న యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో లో జరగనున్న అంతర్జాతీయ ఆరోగ్య సదస్సుకు కేటీఆర్‌ను ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు.టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ సీఈవో సాయి గుండవెల్లి కేటీఆర్‌కు ప్రత్యేక ఆహ్వానం పంపినట్లు పేర్కొన్నారు. ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, భవిష్యత్ వైద్య విధానాలు, ఆవిష్కరణలపై సదస్సులో విస్తృతంగా చర్చించనున్నారు. సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డిజిటల్ హెల్త్, పర్సనలైజ్డ్ మెడిసిన్, మెడికల్ టూరిజం తదితర అంశాలపై అంతర్జాతీయ నిపుణులు చర్చించనున్నారు. ...మిగతా 2 లో...

విమానాన్ని కూల్చేయాలనుకున్నా: ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

- **ఫ్లైదుబాయ్ విమానాన్ని కూల్చేయాలన్నది తన ప్లానేనన్న కోపైలట్**
- **విచారణలో నేరాన్ని అంగీకరించిన హమామ్ అల్-హమామీ**
- **కెప్టెన్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి దాడి చేశానని వెల్లడి**
- **హమామ్ సోషల్ మీడియాలో వేలకొద్దీ ఉగ్రవాద పోస్టుల గుర్తింపు**
- **ఈ కుట్ర వెనుక ఉగ్రసంస్థల హస్తంపై ఇజ్రాయెల్, సౌదీ ఏజెన్సీల దర్యాప్తు**

ఫ్లైదుబాయ్ విమానం హైజాక్ యత్నం కేసులో నిందితుడైన కోపైలట్ హమామ్ అల్-హమామీ విచారణలో సంచలన విషయాలు వెల్లడించాడు. ఉద్దేశపూర్వకంగానే విమానాన్ని కూల్చివేయాలని ప్రయత్నించానని అంగీకరించాడు.

...మిగతా 2 లో...

జైరాం.. మీరింత తొందరపడతారని నేను అనుకోలేదు..!

- **జైరాం రమేశ్ పోస్టుపై కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ఆగ్రహం**
- **అది ప్రజాగ్రహమంటూ జైరాం రమేశ్ చేసిన వ్యాఖ్యలపై దుమారం**
- **కాంగ్రెస్ నేతపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తీవ్ర అభ్యంతరం**
- **అన్నమయ్య జిల్లా సభ ఘటనపై సోషల్ మీడియాలో మాటల యుద్ధం**
- **ఏపీ సభలో కనిపించింది ప్రజల ఉత్సాహమేనని స్పష్టీకరణ**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్‌పై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోషల్ మీడియా వేదికగా తీవ్రస్థాయిలో స్పందించారు. “జైరాం, నమ్మ లేకపోతున్నాను. మీరింత తొందరపడతారని నేను అనుకోలేదు. అక్కడ ఉన్నది టీడీపీ, జనసేన కార్యకర్తలు. తమ నాయకులైన చంద్రబాబు, పవన్ కల్యా ణ్‌లతో మాట్లాడాలని వారు ఉత్సాహం చూపారు. కార్యక్రమం తర్వాత బయ టకు వచ్చి మాట్లాడతారని గౌరవ ముఖ్యమంత్రి వారికి చెప్పారు.అక్కడ జరిగి ంది అంతే”అని ఆమె తన పోస్టులో ఘాటుగా బదులిచ్చారు. ...మిగతా 2 లో...

TGTEL/26/A5513
వార్తదీపిక

ఫ్లైదుబాయ్ విమాన ఘటన.. క్యాబిన్ సిబ్బంది పాత్రపై అనుమానాలు...!

మొదటిపేజీ తరువాయి

విమానాన్ని కూల్చేయడమే లక్ష్యంగా ఈ దాడి జరిగినట్లు తెలుస్తోంది. తీవ్రంగా గాయపడినా, కెప్టెన్ స్మిత్ మచ్చర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి కాక్‌పిట్ డోర్ తెరిచి సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆయన కేకలు విన్న ప్రయాణికులు వెంటనే స్పందించారు. వారిలో ఉన్న ఇద్దరు ఆఫ్-రోస్టర్ పైలట్లు, మరికొందరు ప్రయాణికులు కలిసి కో-పైలట్ హమామ్‌ను అడ్డుకున్నారు. అతడిని కిందికి పడేసి, ఇయర్‌ఫోన్ వైర్లతో చేతులు కట్టేసి పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఈ ఘటనలో పట్టుబడిన వారిలో టీవీ షో 'మేడే' చూసిన అనుభవంతో విమానాన్ని స్థిరంగా ఉంచడంలో సహాయపడిన ప్లంబర్ యానివ్ హయిన్, గాయపడిన కెప్టెన్‌కు చికిత్స అందించిన దంత వైద్యుడు షోటా ముసేవ్ కూడా ఉన్నారు. సిబ్బంది పాత్రపై అనుమానాలు దాడి చేసిన కో-పైలట్‌ను ప్రయాణికులు బంధించిన తర్వాత అసలు నాటకీయత మొదలైంది. 'ది న్యూయార్క్ పోస్ట్' కథనం ప్రకారం, ఫ్లైదుబాయ్ క్యాబిన్ సిబ్బంది ప్రయాణికుల వద్దకు వచ్చి, దాడికి పాల్పడిన హమామ్ అల్-హమామి కట్లు విప్పి అతడిని వదిలివేయమని కోరారు. సిబ్బంది చేసిన ఈ వింత అభ్యర్థనతో ప్రయాణికులు విస్తుపోయారు. వారిపై తీవ్ర అనుమానం పెంచుకున్న ప్రయాణికులు, అందుకు నిరాకరించారు. అతడిని పోలీసులకే అప్పగిస్తామని తేల్చిచెప్పారు. అంతేకాదు, సిబ్బందిని నమ్మని ప్రయాణికులు.. వారిని కాక్‌పిట్ సమీపంలో ఉండనీయకుండా విమానం మధ్య భాగంలో కూర్చోవాలని ఆదేశించారు. ఇది పరిస్థితి ఎంత ఉద్రిక్తంగా మారిందో తెలియజేస్తుంది. విచారణ కోసం కో-పైలట్ ప్రాణాలతో ఉండటం ముఖ్యమని భావించిన ప్రయాణికులు, అతడికి ఆక్సిజన్ మాస్క్ కూడా అందించారు. దాదాపు గంటా 40 నిమిషాల పాటు అతడిని తమ ఆధీనంలో ఉంచుకొని, విమానాన్ని సురక్షితంగా సమీపంలోని ఓ చిన్న విమానాశ్రయంలో ల్యాండ్ చేశారు. మొత్తం 174 మంది ప్రయాణికులు (27 మంది పిల్లలతో సహా) సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. భారత కెప్టెన్ స్మిత్ మచ్చర్ హీరోయిజం, ప్రయాణికుల ధైర్యసాహసాలను అందరూ ప్రశంసిస్తున్నప్పటికీ.. దాడి చేసిన వ్యక్తిని విడిచిపెట్టమని సిబ్బంది ఎందుకు కోరారనేది ఆసక్తికరంగా మారింది. ఈ ఘటనపై దర్యాప్తులో సిబ్బంది పాత్రపై కూడా విచారణ జరిపే అవకాశం ఉంది.

సరిహద్దు చొరబాటుపై భగ్గుమన్న భారత్.. పాక్ దౌత్యవేత్తకు సమన్లు...

మొదటిపేజీ తరువాయి

పంజాబ్ సరిహద్దుల్లో జరిగిన ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నట్లు స్పష్టం చేసింది.విదేశాంగ మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. అక్టోబర్ 2వ తేదీన పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్ సెక్టార్ వద్ద అంతర్జాతీయ సరిహద్దు వెంబడి ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు భారత భూభాగంలోకి అక్రమంగా ప్రవేశించారు. వెనక్కి వెళ్లిపోవాలని సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) పలుమార్లు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ వారు పట్టించుకోలేదు. పైగా సరిహద్దు కంచె వైపు దూసుకెళ్తుండటంతో వారిని భద్రతకు ముప్పుగా భావించిన బీఎస్ఎఫ్ బలగాలు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఈ కాల్పుల్లో ఇద్దరు వ్యక్తులు మరణించారు.ఈ ఘటనపై పాకిస్థాన్ చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవి, దురుద్దేశంతో కూడినవని భారత్ కొట్టిపారేసింది. పాకిస్థాన్ నుంచి పనిచేస్తున్న సాయుధ నార్కోటిక్స్ సిండికేట్ల కార్యకలాపాల్లో భాగంగానే ఈ చొరబాట్లు జరుగుతున్నాయని ఆరోపించింది. ఇలాంటి కార్యకలాపాలపై, అలాగే దీని వెనుక పాకిస్థాన్ సరిహద్దు దళాల ప్రమేయం ఉందన్న ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఇస్లామాబాద్‌ను భారత్ డిమాండ్ చేసింది. సరిదిద్దుబాటు చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయ సరిహద్దు పవిత్రతను గౌరవించాలని హితవు పలికింది. మరోవైపు, ఈ ఘటనపై పాకిస్థాన్ కూడా తీవ్రంగానే స్పందించింది. ఇస్లామాబాద్‌లోని భారత అగ్రశ్రేణి దౌత్యవేత్తను పిలిపించి నిరసన తెలియజేసింది. బీఎస్ఎఫ్ కాల్పుల్లో మరణించిన ఇద్దరూ నిరాయుధులైన అమాయక పౌరులని ఆరోపించింది. ఈ ఘటనపై తక్షణమే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేసింది. ఈ విధంగా ఒకే ఘటనపై ఇరు దేశాలు భిన్న వాదనలు వినిపిస్తూ, దౌత్యపరమైన నిరసనలు తెలుపుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

విమానాన్ని కూల్చేయాలనుకున్నా: ఫ్లైదుబాయ్ కోపైలట్ వాంగ్మూలం

మొదటిపేజీ తరువాయి

చావంటే తనకు ఏ మాత్రం భయం లేదని దర్యాప్తు అధికారులతో స్పష్టం చేశాడు.ఇజ్రాయెల్‌కు వెళ్తున్న ఎఫ్ జెడ్ 1073 విమానంలో పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్‌ను ఉద్దేశపూర్వకంగానే దారి మళ్లించి, ఆ తర్వాత తన పథకం ప్రకారం దాడికి పాల్పడినట్లు హమామ్ ఒప్పుకున్నాడు. ప్రార్థన చేసుకుంటానని చెప్పి కెప్టెన్ దృష్టి మరల్చి, విమానంలోని గొడ్డలితో దాడికి యత్నించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ ఘటనపై ఇజ్రాయెల్, సౌదీ అరేబియా దర్యాప్తు బృందాలు లోతుగా విచారణ జరుపుతున్నాయి. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలతో గానీ, ఇరాన్‌తో గానీ ఏమైనా సంబం ధాలున్నాయా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది. హమామ్ యూఏఈలో జన్మించాడు. అతడి తండ్రి ఒమన్‌కు, తల్లి సిరియాకు చెందినవారు. ఫ్లైదుబాయ్‌లో చేరడానికి ముందు అతను ఒమన్, సిరియా, మొరాకోలలో నివసించాడు.సిరియాలో ఎక్కువ కాలం నివసించినందున, అక్కడి సుదీర్ఘ అంతర్యుద్ధం సమయంలో అతను ఉగ్రవాదం వైపు ఆకర్షితుడై (రాడికలైజ్) ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అతని సోషల్ మీడియా ఖాతాల్లో వేలకొద్దీ ఉగ్రవాద సంబంధిత పోస్టులు, సందేశాలను అధికారులు గుర్తించారు. అయితే, ఈ కుట్ర వెనుక ఇంకెవరైనా ఉన్నారా అన్న విషయాన్ని మాత్రం అతను ఇంకా వెల్లడించలేదు. కేసులో విచారణ కొనసాగుతోంది.

పోడు భూములపై త్వరలో తీపి కబురు





- భద్రాద్రి సమగ్రాభివృద్ధికి అధిక నిధులు కేటాయిస్తా
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు నమోదుకు విస్తృతంగా కృషి చేయాలి
- రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

వార్త బిపీక న్యూస్ : :

తరతరాలుగా పోడు కొట్టుకుంటూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పోడు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న వారికి పోడు భూముల సమస్యల పరిష్కారంపై త్వరలోనే తీపి కబురు చెబుతానని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఆదివారం లక్ష్మీదేవి పల్లి మండలం రేగళ్లలో జరిగిన కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశంలో ప్రసంగించారు. అటవీ భూములకు సంబంధించి కొన్ని అంశాలు కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నాయని కేంద్రంతో సంప్రదించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

సంక్షేమం అభివృద్ధికి ప్రాధాన్యం..

గత తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో పేదలను పట్టించుకోలేదని గళ మెత్తిన నిరుద్యోగులను ఉరికించి కొట్టారని 33 నెలల మా ప్రజా ప్రభుత్వ పాలనలో రైతు రుణమాఫీ రైతు భరోసా క్వింటాకు రూ.500 బోనస్ మహిళలకు ఉచిత బస్సు ప్రాయాణం పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఉద్యోగులకు నోటిఫికేషన్లతో ప్రజా సంక్షేమ పథకాలతో ముందుకు సాగుతున్నామని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో పేదలకు ఇల్లిస్తే కమిషన్లు రావని లక్ష కోట్లతో కాళేశ్వరం కట్టి ఇష్టం వచ్చినట్లు దోచుకోగా వారు అధికారంలో ఉన్నప్పుడే అది కూలే పరిస్థితి వచ్చిందని విమర్శించారు.

అన్ని గ్రామాలకు నిధులిస్తా..

ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అన్ని గ్రామాలకు నిధులను కేటాయించి మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను మూడు అవసరమైతే నాలుగో విడతలో కూడా మంజూరు చేస్తామని రాజకీయాలకు అతీతంగా పేదలకు కేటాయిస్తామని వెల్లడించారు. హైదరాబాదులోని పేదలు వారు పనిచేసే ప్రాంతాల్లోనే ఖరీదైన భూముల్లో అపార్ట్ మెంట్లు కట్టించి ఇస్తున్నామని ఒక్కొక్కరికీ రూ.కోటి విలువ చేసే ఇల్లు దక్కుతోందని అన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి..

ఖమ్మం, నల్లగొండ, వరంగల్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. బృందాలుగా గ్రామ మండల స్థాయిలో విస్తృతంగా పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు దేవీ ప్రసన్న, సీనియర్ నాయకులు నాగా సీతారాములు, ఆళ్ల మురళి, గోపాలరావు, మండల అధ్యక్షులు ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నేను అనుకోలేదు..!

మొదటిపేజీ తరువాయి

ఓ చిన్న విషయాన్ని వక్రీకరించి తప్పుడు ప్రచారం చేయడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.అసలేం జరిగిందంటే..ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లెలో 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రసంగిస్తుండగా, సభకు హాజరైన కొందరు యువకులు తమ నాయకులను చూడాలనే ఉత్సాహంతో కేకలు వేశారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కలుగజేసుకుని, కార్యక్రమం ముగిశాక నాయకులు అందరితో మాట్లాడతారని చెప్పి వారిని శాంతపరిచారు.అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోను సులేమాన్ ఖాన్ అనే వ్యక్తి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ, 'మొదట ఉద్యోగాలు ఇవ్వండి' అంటూ సభలోని వారు నినాదాలు చేశారని తప్పుడు సమాచారాన్ని జతచేశారు. ఈ పోస్టును జైరాం రమేశ్ రీపోస్ట్ చేస్తూ, "ప్రజల్లో ఎంత ఆగ్రహం ఉందో ఆర్థిక మంత్రి స్వయంగా చూస్తున్నారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని ప్రజలను నిశ్శబ్దంగా మార్చాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు.జైరాం రమేశ్ వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. వాస్తవాలు తెలుసుకోకుండా, ఎవరో పెట్టిన తప్పుడు పోస్టు ఆధారంగా వ్యాఖ్యలు చేయడం తగదని హితవు పలికారు. సభలో కనిపించింది ప్రజాగ్రహం కాదని, తమ నాయకుల పట్ల ప్రజలు, కార్యకర్తలు చూపిన ఉత్సాహం అని వారు స్పష్టం చేశారు. ఈ ఘటనతో ఏపీలోని ఓ కార్యక్రమం చుట్టూ జాతీయ స్థాయిలో సోషల్ మీడియా వేదికగా రాజకీయ మాటల యుద్ధం రాజుకుంది.

చారిత్రక దినమన్న కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి

ఈ సమావేశంలో మరో కీలక నిర్ణయం కూడా తీసుకున్నారు. ఓటర్ల జాబితా సవరణ అంశంపై ఎన్నికల కమిషన్ చీఫ్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపట్టాలని కూటమి నిర్ణయించింది. ఇందులో భాగంగా అక్టోబర్ 13, 14 తేదీల్లో జిల్లా స్థాయి ప్రదర్శనలు, అక్టోబర్ 15న చెన్నైలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించాలని తీర్మానించారు. ఇండియా కూటమిలో తమ పార్టీ అధికారికంగా చేరినట్లు టీవీకే మంత్రి ఆధవ్ అర్జున సైతం ధ్రువీకరించారు. అయితే, దీనిపై పార్టీ అధినేత, ముఖ్యమంత్రి విజయ్ నుంచి నేరుగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

70,000 మందికి అవకాశం..!

మొదటిపేజీ తరువాయి

ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత సమతుల్యంగా విస్తరించాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయని, ఇందులో భాగంగా ఏడు కీలక రంగాల్లో రష్యాకు భారత ఎగుమతులు పెంచేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. ఆటోమొబైల్స్, ఫార్మాస్యూటికల్స్, ఆహార ఉత్పత్తులు, సముద్ర ఉత్పత్తులు, ఇంజినీరింగ్ వస్తువులు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ రంగాల్లో ఈ అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు.ఇంధన సహకారంపై మాట్లాడుతూ.. బహుళ వనరుల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగించడం ద్వారా భారత వినియోగదారుల ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యత అని జైశంకర్ స్పష్టం చేశారు. చెన్నై-వ్లాదివోస్టాక్ కారిడార్, అంతర్జాతీయ నార్త్-సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్, నార్తర్న్ సీ రూట్ వంటి కనెక్టివిటీ ప్రాజెక్టులపైనా సమావేశంలో చర్చించారు. భారత్-యురేషియన్ ఎకనామిక్ యూనియన్ మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) కుదుర్చుకునే అంశం కూడా ప్రస్తావనకు వచ్చింది.ఇదే సమయంలో ఉక్రెయిన్ సంక్షోభంపై భారత్ దౌత్యపరమైన ప్రయత్నాలను జైశంకర్ కమిటీకి వివరించారు. చర్చలు, శాంతియుత పరిష్కారానికి భారత్ ఎల్లప్పుడూ మద్దతిస్తుందని పునరుద్ఘాటించారు. రష్యా సైన్యంలో సహాయక విధుల పేరుతో చిక్కుకున్న భారతీయ పౌరుల విడుదల కోసం చేస్తున్న ప్రయత్నాలను కూడా ఆయన సభ్యులకు తెలియజేశారు. ఇప్పటివరకు సుమారు 140 మందిని సురక్షితంగా విడిపించామని, మరో 55 మంది ఆచూకీ కోసం రష్యా అధికారులతో చర్చిస్తున్నామని తెలిపారు.

రేవంత్ రెడ్డి మన నీళ్లను గిఫ్ట్ ప్యాక్ చేసి చంద్రబాబుకు పంపిస్తున్నాడు: కవిత

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడేళ్లలో ఏ ఒక్క నీటిపారుదల ప్రాజెక్టుపై శ్రద్ధ పెట్టకపోవడం వల్లే రాష్ట్రం నేడు కరవుతో అల్లాడుతోందని విమర్శించారు.ఆదివారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు తీవ్రంగా ఉన్నాయని, ప్రభావిత మండలాలను ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఆమె డిమాండ్ చేశారు. ఎల్ నినో ప్రభావంపై శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, నివారణ చర్యలు చేపట్టడంలో విఫలమైందని ధ్వజమెత్తారు. ఇటీవల జరిగిన కేబినెట్ సమావేశంలో కూడా కరవు మండలాలను ప్రకటించకపోవడం రైతుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తోందన్నారు."నార్లాపూర్ రిజర్వాయర్‌పై కొంతైనా ఖర్చు చేసి ఉంటే, ఈరోజు దాన్ని నింపుకొని కల్వకుర్తి ఆయకట్టుకైనా నీరందించే అవకాశం ఉండేది. దానివల్ల భూగర్భ జలాలు కూడా పెరిగేవి" అని కవిత అభిప్రాయపడ్డారు. కృష్ణా, గోదావరి నదుల్లో నీళ్లు అందుబాటులో ఉన్నప్పటికీ.. పాలమూరు-రంగారెడ్డి వంటి ఎత్తిపోతల పథకాలను నింపకుండా మన నీటిని ఏపీకి తరలిస్తున్నారని ఆరోపించారు.రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పుడు కేవలం 6-7 గంటల కోతలతో సరిపెడుతున్నారని మండిపడ్డారు. విద్యుత్ కోతల విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికే కాకుండా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రధాన పట్టణాల్లోనూ తాగునీటి ఎద్దడి మొదలైందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. కరవుతో నష్టపోతున్న రైతులకు, ప్రజలకు తమ పార్టీ అండగా ఉంటుందని, 60 నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జ్‌లు క్షేత్రస్థాయిలో పనిచేస్తారని కవిత భరోసా ఇచ్చారు.

కేటీఆర్‌కు మరో అంతర్జాతీయ గౌరవం..

కాలిఫోర్నియా హెల్త్ ఫెస్ట్‌కు ఆహ్వానం...

మొదటిపేజీ తరువాయి

వైద్యం, సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో చోటుచేసుకుంటున్న మార్పులపై వివిధ దేశాలకు చెందిన ప్రముఖులు తమ అభిప్రాయాలను పంచుకోనున్నారు.ఈ సందర్భంగా కేటీఆర్ కూడా ఆరోగ్య రంగంలో సాంకేతికత వినియోగం, ఆవిష్కరణలు, డిజిటల్ హెల్త్ తదితర అంశాలపై తన ఆలోచనలను అంతర్జాతీయ వేదికపై పంచుకోనున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

ఆర్టీసీ కాలనీ అధ్యక్షుని ఏకగ్రీవ ఎన్నిక

సంగారెడ్డి, అక్టోబర్ 4, వార్త దీపిక న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని ఆర్టీసీ కాలనీ అధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నికలు నిర్వహించారు. అనంతరం ఆర్టీసీ కాలనీ వాసులు నిర్ణయం తీసుకున్నారు. ఆర్టీసీ కాలనీ ప్రజలు అధ్యక, కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్టీసీ కాలనీ అధ్యక్షులుగా రమేశ్వర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా ఎం.డి. యాదుల్ పాటిల్, జనరల్ సెక్రటరీ లక్ష్మణ్, జాయింట్ సెక్రటరీ రాజయ్యచారి, గౌరవ అధ్యక్షులుగా అన్వర్, పోచయ్య, కోశాధికారిగా క్రిష్ణ, సలహదారులుగా సిహెచ్.రాజన్న, మురళీ దర్ రెడ్డి, ఎం.మోహన్, ఎస్.రమేష్ కుమార్, డి.లక్ష్మణ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తమ ఎన్నికకు సహకరించిన కాలనీ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఆర్టీసీ కాలనీలో ఏమైన సమస్యలుంటే దగ్గరుండి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కాలనీ వాసులు పాల్గొన్నారు.



ఎస్టీ హస్టల్లో బతుకమ్మ సంబరాలు జోష్

తాండూర్, అక్టోబర్ 4, వార్త దీపిక న్యూస్ :

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలక బతుకమ్మ పండుగ ప్రత్యేకంగా నిలుస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ పట్లోళ్ల నిరజాబాల్ రెడ్డి అన్నారు. తాండూర్ ఎస్టి హాస్టల్లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఆమె పాల్గొని విద్యార్థులతో కలిసి బతకమ్మ సంబరాల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచులకు ఆత్మీయతకు ప్రకృతితో మనకున్న అనుబంధాన్ని చాటుతుందన్నారు. విద్యార్థులు మన సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకొని వాటిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ఉందన్నారు. హాస్టల్ విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి పాటలు పాడుతూ సాంప్రదాయ నృత్యాలతో ఉత్సాహ వేడుకలు జరుపుకున్నారు. చైర్మన్ నీరజబాల్ రెడ్డితో పాటు హాస్టల్ వార్డెన్ భాగ్యలక్ష్మి, విద్యార్థినులు పాల్గొని బ్రతకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



మార్కెట్ వైస్ చైర్మన్ గా బాధ్యత

వికారాబాద్, అక్టోబర్ 4, వార్త దీపిక న్యూస్ :

జిల్లా కోటిపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గా ఎం. మధులత శ్రీనివాస్ చారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కందుకూరి రాజకుమార్ బీసీ నాయకులు మదులత హృదయపూర్వక శుభాభినందనలు తెలిపారు. మధులత ఇదివరకు మండల వైస్ ఎంపీపీగా సేవలందించిన ఆమెకు ఈ పదవి అప్పగించినందుకు, భవిష్యత్ లో రాష్ట్ర స్థాయిలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఆమె భర్త శ్రీనివాస్ చారి సీనియర్ జర్నలిస్టుగా మూడు దశాబ్దాలుగా ఆంధ్రజ్యోతి పత్రికలో సేవలందిస్తున్నారు. అదేవిధంగా విశ్వకర్మ విశ్వబ్రాహ్మణ సంఘానికి ముందుండి నడిపిస్తున్నారు. వారికి వారి కుటుంబానికి హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



ఘనంగా ఇర్ఫానీ దర్గా 24వ ఉర్సు ఉత్సవాలు

దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు, కవ్వాలి కార్యక్రమం

హాజరై కళాకారులకు కానుకలు అందించిన జగ్గారెడ్డి





సంగారెడ్డి, అక్టోబర్ 4, వార్త దీపిక న్యూస్ :

పట్టణ శివారులోని ఇర్ఫాని దర్గా 24వ ఉర్సు ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. ఉర్సు ముగింపు సందర్భంగా దర్గాలో ప్రత్యేక దీపారాధన, ప్రార్థనా కార్యక్రమాలను నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపాలు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. ఉర్సు ముగింపు కార్యక్రమానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి హాజరై దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గాలకు కులమతాలకు అతీతంగా ప్రజలు తరలివస్తారని, ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల మధ్య సోదరభావం, ఐక్యతను మరింత పెంపొందిస్తాయని అన్నారు. అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ ఉర్సు వేడుకల్లో సంగారెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ అహ్మద్, కాంగ్రెస్ నాయకుడు కూన సంతోష్ కుమార్, దర్గా నిర్వాహకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

5వ తెలంగాణ బ్యాడ్మింటన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో బంగారు, కాంస్య పతకాలు

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, అక్టోబర్ 4, వార్త దీపిక (న్యూస్ ప్రతినిధి):

తెలంగాణ పోలీస్ అకాడమీ, హైదరాబాద్‌లో నిర్వహించిన 5వ తెలంగాణ బ్యాడ్మింటన్ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసు సిబ్బంది ప్రతిభ కనబరిచారు. జిల్లాకు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సజీవ్ 50 వయస్సు విభాగంలో బంగారు పతకం సాధించగా, మహిళల ఓపెన్ డబుల్స్ విభాగంలో శ్రావ్య, ధరణిలు కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ ఈ.డి. సజీవ్, శ్రావ్య, ధరణిలను శాలువాతో సన్మానించి అభినందించారు. క్రీడల్లో ప్రతిభ కనబరచి జిల్లా పోలీసు శాఖకు గౌరవం తీసుకురావడం అభినందనీయమని అన్నారు. పోలీసు సిబ్బంది విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటుతూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించేలా క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ఏఆర్ డిఎస్పీ నరేందర్ ఉన్నారు



ప్రధాని మోదీ ప్రజాసేవ దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించడం

ఎమ్మెల్సీ డాక్టర్ అంజిరెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 4, వార్త దీపిక న్యూస్ :

దేశ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా, 'సబ్ కా సాథ్ సబ్ కా వికాస్' మంత్రంతో భారతదేశ ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు విజయవంతమైన సుదీర్ఘ సేవాకాలాన్ని పూర్తి చేసుకోవడం ప్రతి భారతీయుడు గర్వించదగ్గ విషయమని ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ప్రధాని మోదీ ప్రజా జీవితంలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా 'సేవ సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా ఎంఎన్ఆర్ మెడికల్ కళాశాలలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి డాక్టర్ అంజిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మోదీ తీసుకున్న సాహసోపేత నిర్ణయాలు, అమలు చేసిన సంక్షేమ పథకాలు దేశ రూపురేఖలను పూర్తిగా మార్చేశాయని కొనియాడారు. కేవలం రాజకీయ అధికారం కోసం కాకుండా, అంత్యోదయ లక్ష్యంగా సాగుతున్న ఈ పాలన ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వులు పూయిస్తోందన్నారు. ఈ మైలురాయిని కేవలం రాజకీయ సంబరాలకే పరిమితం చేయకుండా, ప్రాణాపాయంలో ఉన్న రోగులను ఆదుకునేలా రక్తదాన శిబిరం రూపంలో నిర్వహించడం బీజేవైఎం కార్యకర్తల సామాజిక బాధ్యతకు నిదర్శనమని ప్రశంసించారు. యువతే దేశానికి వెన్నెముక అని నమ్మే ప్రధాని మోదీ బాటలో నేడు యువత ఇటువంటి సేవా కార్యక్రమాల్లో ముందుండాలన్నారు.?ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్ దేశ్‌పాండే, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ప్రవీణ్, బీజేపీ మండల అధ్యక్షులు హర్ష వర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలి

జగన్నాధపురం లో ఐడి కార్డులు పంపిణీ

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు

వార్త దీపిక న్యూస్ :

గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రతి కార్యకర్త సమష్టిగా కృషి చేయాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త వడ్డీ రఘురాం నాయుడు సూచించారు. తాడేపల్లిగూడెం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఐడీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు చిట్టూరి బాపన్న అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు.ముఖ్య అతిథిగా వడ్డీ రఘురామ్ నాయుడు హాజరై కార్యకర్తలకు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు ప్రజలకచేయాలని పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో, సమష్టి కృషితో పనిచేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుండుమొగుల బలుసులు, గొర్రెల శ్రీనివాస్, పొనుకుమాటి శేషులత, కలిశెట్టి తాతారావు, దారపురెడ్డి శ్రీనివాస్, పాలూరి దొరబాబు, కండెల్లి రాజేష్, ములపర్తి అర్జున్‌రావు, సబ్బీతి బ్రాహ్మయ్య, పాలకోడేటి సురేష్, కేసాని అశోక్ తదితరులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

అరగొలనులో వైభవంగా విజయదుర్గ అమ్మవారి శరన్నవరాత్రులు

11 నుంచి 20 వరకు వివిధ అలంకరణల్లో అమ్మవారి దర్శనం
ప్రతిరోజూ విశేష పూజలు.. సాంస్కృతిక కార్యక్రమాలు

వార్త దీపిక న్యూస్

తాడేపల్లిగూడెం మండలంలోని అరగొలనులో కొలువైన విజయదుర్గ అమ్మవారి శరనవరాత్రి మహోత్సవాలను ఈ నెల 11 నుంచి అత్యంత వైభవంగా నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే సిద్ధం చేశామని చెప్పారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారు రోజుకో విశిష్ట అలంకరణలో దర్శనమిస్తారని తెలిపారు. ప్రతిరోజు అమ్మవారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు, భక్తులను అలరించేలా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని సూచించారు.

విజయదుర్గ అమ్మవారి అలంకరణలిలా

ఈ నెల 11న అమ్మవారికి స్వర్ణకవచాలంకృత కనకదుర్గాదేవి అలంకరణలో దర్శనమిస్తారు. ఉదయం కలసస్థాపన, తులసి పూజ, హోమ కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. గరగల నృత్యం, కాళీ మహా కాళీ బోనాల డాన్స్, గొర్రెలాస్ వేషధారణ వంటి145 మంది కళాకారులతో అమ్మవారి భారీ ఊరేగింపు నిర్వహిస్తారు. రాత్రి భజన కార్యక్రమం. 12న అమ్మవారికి గాయత్రీ దేవి అలంకరణ, రాత్రి కూచిపూడి జానపద నృత్య ప్రదర్శన.13న అమ్మవారికి అన్నపూర్ణాదేవి అలంకరణ, రాత్రి అత్తిలి సత్య ఈవెంట్స్, 14న అమ్మవారికి బాలాత్రిపురసుందరీ దేవి అలంకరణ, రాత్రి భవానీల ఆధ్వర్యంలో నిప్పుల గుండం, 15న అమ్మవారికి బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణ, ఉదయం భవానీల కలశ ఊరేగింపు, 11 గంటలకు లక్ష కుంకుమార్చన, రాత్రి డిఫరెంట్ మ్యూజిక్ షో, టీవీ ఆర్టిస్ట్ నాని, మాట్లాడే బొమ్మతో మిమిక్రి,.16న అమ్మవారికి మహాలక్ష్మీదేవి అలంకరణ, రాత్రి దుర్గమ్మ తల్లి కథ. 17న అమ్మవారికి సరస్వతీదేవి అలంకరణ, రాత్రి



శ్రీనివాస అలివేలు మంగా పద్మావతి కళ్యాణ మహోత్సవం. 18న అమ్మవారికి దుర్గాదేవి అలంకరణ. ఉదయం 108 మంది చిన్నారులతో శత మటాభిషేఖం. రాత్రి రాక్ స్టార్ ఆర్కెస్ట్రా, 19న అమ్మవారికి మహిషాసుర మర్దినీ దేవి అలంకరణ. రాత్రి భవానీలతో ఊరేగింపు. 20న విజయదశమి ని పురస్కరించుకుని అమ్మవారి రాజరాజేశ్వరి దేవి అలంకరణ. రాత్రి శమీ పూజ, తెప్పోత్సవం, జ్యోతి దర్శనం, మహిషాసుర వద,బాణాసంచ ప్రదర్శన. 23న ఆలయం వద్ద అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహిం చనున్నామని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహకులు తెలియజేశారు .భక్తులు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్లు ఎన్రోల్ మెంట్ చేయాలి

తాండూర్, అక్టోబర్ 4, వార్త దీపిక న్యూస్ :

వికారాబాద్ జిల్లా బిజెపి అధ్యక్షులు యు.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రమేష్ కుమార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల ఎన్రోల్మెంట్ ఎలా చేయించాలని, పట్టభద్రుల దగ్గరికి ఎలా వెళ్లాలని, అందరినీ కలుపుకొని వికారాబాద్ జిల్లాలో ముఖ్యంగా తాండూర్ పట్టణంలో అత్యధిక ఓటింగ్ ఎన్రోల్ జరిగే విధంగా మార్గదర్శకం చేశారు. పట్టభద్రులు ఎన్రోల్ చేసుకునే క్రమంలో కౌన్సిలర్లు కార్యకర్తలు మీకు సహకరిస్తారని తెలిపారు. టెక్నికల్ ఇష్యూస్ ఏమన్నా ఉన్న మా దృష్టికి తీసుకుని వచ్చినట్లయితే వాటిని సరి చేయిస్తామన్నారు. ఏవైనా అనుమానాలు ఉన్నట్లయితే నివృత్తి కొరకు హెల్ప్ డేస్ నెంబర్లను అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కృష్ణ ముదిరాజ్, పటేల్ విజయ్, బండారం భద్రేశ్వర్, సాయి రెడ్డి, బిజెపి పట్టణ అధ్యక్షులు తాండూర్ ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ నాగారం మల్లేశం, 23 వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్, జిల్లా మాజీ కౌన్సిలర్ బాలప్ప, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, మరం మల్లు, పట్టణ అధ్యక్షులు దోమ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ఏబీవీపీ నగర అధ్యక్షుడిగా జైపాల్ రెడ్డి

తాండూర్, అక్టోబర్ 4, వార్త దీపిక న్యూస్ :

ఏబీవీపీ పాలమూరు విభాగ్ అభ్యాస వర్గంలో తాండూర్ నగర అధ్యక్షుడిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కామర్స్ లెక్చర్ జైపాల్ రెడ్డి నియమితులయ్యారు. బాధ్యతలు స్వీకరించిన ఆయనకు అధ్యాపకులు, నాయకులు, విద్యార్థులు, శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ బలోపేతంతో పాటు విద్యార్థుల సమస్యలు తీర్చే విషయమై కృషి చేయాలని ఆకాంక్షించారు.



భారీగా నాటుసారా పట్టివేత: కుక్కునూరు లో భూక్యా బాలు, బోడ నరసింహల అరెస్ట్ - నలభై లీటర్ల సారా స్వాధీనం

తెలంగాణ నుండి అక్రమంగా సారా తరలిస్తున్న ఆటో, బైక్ సీజ్; ఇద్దరి అరెస్ట్!
సరిహద్దుల్లో నాటుసారా రవాణాపై ఉక్కుపాదం మోపుతాం: ఎక్సైజ్ అధికారుల హెచ్చరిక!



వార్త దీపిక న్యూస్

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలో ఎక్సైజ్ శాఖ అధికారులు అక్రమ నాటుసారా రవాణాపై ఉక్కుపాదం మోపారు. వేలేరు చెక్ పోస్ట్ వద్ద నిర్వహించిన తనిఖీల్లో భారీగా నాటుసారాను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ ఘటనపై అధికారులు స్పందిస్తూ, సరిహద్దు ప్రాంతాల ద్వారా జరిగే అక్రమ రవాణాను పూర్తిగా అణచివేస్తామని హెచ్చరించారు. అసిస్టెంట్ కమీషనర్ కె. నాగ ప్రభు కుమార్ ఆదేశాలు మరియు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో ఎన్ఫోర్స్మెంట్ సిబ్బంది వేలేరు చెక్ పోస్ట్ వద్ద తెల్లవారుజామున వాహన తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో తెలంగాణ రాష్ట్రం బూర్గంపహాడ్ వైపు నుండి వస్తున్న రెండు వాహనాలను పరిశీలించగా, అక్రమంగా తరలిస్తున్న 40 లీటర్ల నాటుసారా బయటపడింది. దీంతో నాటుసారాతో పాటు రవాణాకు ఉపయోగించిన ఆటో మరియు బైక్ లను అధికారులు సీజ్ చేశారు. ఈ దాడి అనంతరం ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ... పొరుగు రాష్ట్రం నుండి అక్రమంగా నాటుసారాను తరలిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, నాటుసారా తయారీ మరియు విక్రయాలపై నిఘా మరింత కఠినతరం చేస్తామని, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వేలేరు గ్రామానికి చెందిన భూక్యా బాలు, బోడ నరసింహ అనే ఇద్దరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి నాటుసారాతో పాటు రవాణాకు ఉపయోగించిన ఆటో (టీజీ 28 టీ 0431) మరియు బైక్ (టీజీ 28 ఏ 0274) లను అధికారులు సీజ్ చేసి ఇద్దరి వ్యక్తులను రిమాండ్‌కు తరలించినట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ కె. శ్రీను బాబు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎన్ఫోర్స్మెంట్ ఇన్స్పెక్టర్ వై. ఫణి కుమార్ మరియు ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సీఆర్పీగా జాతీయ స్థాయి అవార్డు అందుకున్న డాక్టర్ దత్తు

సంగారెడ్డి, అక్టోబర్ 4, వార్త దీపిక న్యూస్ :

జిల్లా కేంద్రమైన సంగారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీఆర్పీగా విధులు నిర్వర్తిస్తున్న డాక్టర్ మరెల్లి దత్తు ప్రతిష్ఠాత్మక మహాత్మా గాంధీ విద్యారత్న జాతీయ స్థాయి అవార్డును అందుకున్నారు. భారత ప్రభుత్వం నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ అవార్డును ప్రదానం చేసినట్లు ఆయన తెలిపారు. విద్యారంగంతో పాటు సామాజిక సేవ రంగంలో విశిష్ట సేవలు అందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ అవార్డుతో తనపై మరింత బాధ్యత పెంచిదని ఆయన పేర్కొన్నారు.





భరత్ నగర్ ఈడబ్ల్యూఎస్ కాలనీలో సమస్యలపై సంక్షేమ సంఘం పాదయాత్ర

వార్త దీపిక న్యూస్

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని స్థానిక సమస్యలను క్షేత్రస్థా యిలో పరిశీలించిన కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కమిటీ సభ్యులు భరత్ నగర్ కాలనీ ఈడబ్ల్యూఎస్ గృహ సముదాయం మొదటి దశలో నెలకొన్న స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భం గా కాలనీలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన అధ్యక్షుడు, కమిటీ సభ్యులు స్థానికంగా నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను స్వయంగా తెలుసుకుంటూ, ఆయా సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. కాలనీలో మౌలిక సదుపాయాల మెరుగుదల, పారిశుద్ధ్య నిర్వహణతో పాటు ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. స్థానిక సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సమష్టిగా కృషి చేయనున్నట్లు సంక్షేమ సంఘం ప్రతినిధులు తెలిపారు. కాలనీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ భాగస్వాములై, సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ పాదయాత్రలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డితో పాటు ఉపాధ్యక్షుడు నాగేశ్వర్ రావు బాబు, నరేష్ కుమార్, రత్నారావు, వెంకటేష్ యాదవ్, బుచ్చిబాబు, డేవిడ్, భిక్షపతి గౌడ్, సత్యనారాయణ, రాంబాబు, శ్రీనివాస్, సంతోష్ కుమార్, నాగరాజు, వెంకట్ లక్ష్మి, నాయుడు, రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు



అత్యాధునిక ఆర్థో బెజవాడ హాస్పిటల్స్ డాక్టర్ చలసాని ప్రశాంత్ చికిత్సలపై అవగాహన

వార్త దీపిక న్యూస్

నందిగామ గ్రామీణ ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆలస్యం చేయకుండా సంబంధిత నిపుణులైన వైద్యుల వద్దకు తరలించాలని గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం నాయకులు సూచించారు నందిగామ ఆర్ఎస్ గార్డెన్స్‌లో గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నందిగామ డివిజన్ గ్రామీణ వైద్యుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు బెజవాడ ఆర్థో హాస్పిటల్స్ అత్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు ఈ సందర్భంగా మోకాళ్లు భుజాల సమస్యలనవలందిస్తోందని తెలిపారు బెజవాడ హాస్పిటల్స్‌లో అత్యవసర వైద్య సేవలతో పాటు వివిధ ఇన్సూరెన్స్ పథకాలు ఎన్టీఆర్ వైద్య సేవ సీఎంఆర్ఎఫ్ నిబంధనల మేరకు చికిత్సలు అందిస్తున్నట్లు వివరించారు అత్యవసర పరిస్థితుల్లో సరైన సమయంలో నిపుణుల వైద్య సేవలు అందేలా గ్రామీణ వైద్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు కార్యక్రమంలో నందిగామ డివిజన్‌కు చెందిన పలువురు గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు

Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984